# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారు.**
2. **స్వర్ణాంధ్ర విజన్-2047 ద్వారా రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు.**
3. **భూమిలేని పేద కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయల జమ చేయన్నామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.**
4. **తెలంగాణ శాసనసభ సమావేశాలు ఈరోజు నుంచి తిరిగి కొనసాగనున్నాయి.**
5. **ఈరోజు విజయ్ దివస్‌ను జరుపుకుంటున్నాం.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారు. ఈ పర్యటనలో భాగంగా పోలవరం ప్రాజెక్టు గురించి సమగ్ర సమాచారాన్ని అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకోనున్నారు. డయాఫ్రం వాల్ నిర్మాణం గురించి సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులకు సంబంధించి షెడ్యూల్‌ను విడుదల చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలవరం ప్రాజెక్టును ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ నిన్న సందర్శించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో చేయాల్సిన ఏర్పాట్ల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు.

-------------------------

స్వర్ణాంధ్ర విజన్-2047 ద్వారా రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిన్న నిర్వహించిన 'పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం-భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావం' సభలో పవన్ కల్యాణ్ ప్రసంగిస్తూ, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప మహనీయులు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. మహనీయుల స్ఫూర్తితోనే 'స్వర్ణాంధ్ర-2047' విజన్ డాక్యుమెంట్ తీసుకొచ్చామని పవన్ కల్యాణ్ తెలుపుతూ,

వాయిస్ .. 28 సెకన్లు

-------------------------

భూమిలేని పేద కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయల జమ చేయన్నామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈనెల 28 నుంచి ప్రభుత్వం ఈ ఫథకాన్ని అమలు చేస్తుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమల విస్తరణకోసం కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్, వరంగల్ ప్రాంతాల్లో విమానాశ్రయాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరిస్తూ,

వాయిస్... 25 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తోందని క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైద్య శిబిరాల ఏర్పాటు ద్వారా ఆరోగ్య సమస్యలకు దూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్ళకుండా స్థానికంగానే వైద్య సేవలను పొందవచ్చని తెలిపారు. ప్రజలందరూ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని మెరుగైన వైద్యం పొందాలని మంత్రి సూచించారు.

---------------------------

ఈనెల 9న మొదలై... వాయిదా పడిన తెలంగాణ శాసనసభ సమావేశాలు ఈరోజు నుంచి తిరిగి కొనసాగనున్నాయి. సమావేశాలు ఎప్పటి వరకు కొనసాగించాలనేది బిజినెస్ అడ్వైజరీ కమిటీ –బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు. సమావేశాల్లో ఈరోజు ఉదయం శాసనసభ ప్రారంభం కాగానే.. ఇటీవల మృతి చెంది మాజీ శాసనసభ్యులకు సభ సంతాపం తెలపనుంది. అనంతరం ప్రశ్నోత్తరాల కార్యక్రమం కొనసాగుతుంది. అలాగే పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చ జరగనుంది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ–2024 బిల్లు, తెలంగాణ యూనివర్సిటీల అమెండ్‌మెంట్ బిల్లు–2024ను ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి సభలో ప్రవేశ పెడతారు.

---------------------------

తెలంగాణలో గ్రూప్–2 ఉద్యోగాల కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ టీజీపీఎస్సీ పరీక్షలను నిర్వహిస్తోంది. నిన్న ప్రారంభమైన పరీక్షలు ఈ రోజు కూడా జరుగుతాయి. ఒక్కో పేపర్‌కు 150 మార్కుల చొప్పున మొత్తం నాలుగు పేపర్లకు పరీక్షలు జరుగుతోన్నాయి. పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు జరుగుతాయి. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ, గ్రూప్ 2 పరీక్షకు అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

ఈరోజు విజయ్ దివస్ ను జరుపుకుంటున్నాం. 1971లో 13 రోజుల పాటు జరిగిన యుద్ధంలో భారత్ పాకిస్థాన్‌పై సాధించిన ఘన విజయానికి గుర్తుగా ప్రతి ఏటా డిసెంబర్ 16వ తేదీని విజయ్ దివస్ గా నిర్వహించుకుంటున్నాం. 93 వేల మంది పాకిస్తాన్ సైనికులు భారత సైన్యానికి లొంగిపోవడంతో పాటు నూతన బంగ్లాదేశ్ అవతరణకు ఆ యుద్ధం దారి తీసింది. బంగ్లాదేశ్ ఏర్పాటు కోసం భారత్ పాకిస్థాన్‌పై జరిపిన యుద్ధంలో అమరులైన భారత వీరులను స్మరించుకుంటూ జాతి యావత్తూ విజయ్ దివస్ రోజున వారికి నివాళు

లు అర్పిస్తోంది. యుద్ధం ప్రకటింపబడిన మూడు రోజుల్లోగా భారత దళాలు పాకిస్తాన్ వాయు సేనను పూర్తిగా స్వాధీనం చేసుకోగలిగాయని.. అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పార్లమెంట్‌లో ధ్రువీకరిస్తూ చేసిన ప్రసంగంలోని కొంత భాగాన్ని ఇప్పుడు విందాం..

వాయిస్ ...18 సెకన్లు

---------------------------

ఆంధ్రుల పోరాటానికి ప్రతిరూపంగా అమరజీవి పొట్టి శ్రీరాములు నిలుస్తారని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కొనియాడారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా నిన్న గుంటూరులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

...వాయిస్... 30 సెకన్లు

---------------------------

విజన్-2047 పేరుతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి ప్రచార విన్యాసాలను చేస్తున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్ జగన్‌మోహన్ రెడ్డి విమర్శించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ఆయన ఆరోపించారు. 'చంద్రబాబు నాయుడు 1998లో కూడా విజన్-2020 విడుదల చేశారని, అది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలు కాలేదని అన్నారు. ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ ఆస్తులను విక్రయించారని ఆరోపించారు. ఇప్పుడు విజన్-2047 పేరుతో మరో డాక్యుమెంట్ విడుదల చేయడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలో సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం చూపుతూ.. సుస్థిర అభివృద్ధి దిశగా వైసిపి ప్రభుత్వ హయాంలో చర్యలు తీసుకున్నామని, ఆ సంస్కరణలను నిలిపివేశారని జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా చలి తీవ్రత పెరిగిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల కంటే తక్కువగా నమోదవుతున్నాయని పేర్కొంది. ఏజెన్సీ ప్రాంతంలో చలిగాలులు వీస్తున్నాయని ఉదయం 9 గంటల వరకు పొగమంచు ప్రభావం కనిపిస్తోందని వెల్లడించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం కుంతలాంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 5.7 డిగ్రీలుగా నమోదైంది. పార్వతీపురం మన్యం, శ్రీ సత్యసాయి, అనంతపురం, విజయనగరం, శ్రీకాకుళం, అన్నమయ్య, అనకాపల్లి, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, కాకినాడ తదితర జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే తగ్గాయని తెలిపింది. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

తెలంగాణ వ్యాప్తంగా చలి తీవ్రత కొనసాగుతోందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని పేర్కొంది.

======================